

‘లింక్ కల’వదే!

పలు గ్రామాలను కలిపే లింక్ రోడ్లు అనుసంధానానికి నోచుకోవడం లేదు. ప్రయాణికులు కల నెరవేరడం లేదు. 8లో▸



పెన్షన్ పెంచి ఇవ్వాలి

ప్రభుత్వం పెన్షన్‌దారులకు పెన్షన్ పెంచి హామీ నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



సమస్యలు పరిష్కరించాలి

దళితుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలం అయ్యారని కేవీపీఎస్ నేతలు విమర్శించారు. 8లో▸

చుక్క నీరు చేరలే..

• ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు • అయినా వెలవెలబోతున్న కొన్ని చెరువులు • ఆక్రమణలు.. అడ్డుగా నిర్మాణాలే కారణం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొద్ది రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని అనేక వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు మత్తడి దూకుతున్నాయి. హిమాయత్‌సాగర్‌కు భారీగా వరద వచ్చి చేరుతోంది. షాబాద్, పరిగి, షాద్‌నగర్, శంషాబాద్, మొయినాబాద్ ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు హిమాయత్‌సాగర్ నిండుకుండలా మారింది. ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో అధికారులు ఐదు రోజుల క్రితమే నాలుగు గేట్లు తెరిచి దిగువకు నీటిని వదులుతున్నారు. జంటజలాశయాల్లో కీలకమైన హిమాయత్‌సాగర్ గలగల పారుతుంటే ఉస్మాన్‌సాగర్ మాత్రం వెలవెలబోతోంది. జలాశయం ఎగువ ప్రాంతంలోని శంకర్‌పల్లి, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, మర్పల్లి, వికారాబాద్‌లోని వ్యవసాయ భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారడం, వాటిలో పెద్ద ఎత్తున ఫాం హౌస్‌లు వెలియడం, చెరువులోకి వరదనీటిని తెచ్చే వాగులకు అడ్డుగా భారీ ప్రహరీలు నిర్మించడమే ఇందుకు కారణం.



వెలవెలబోతున్న బాతుల చెరువు

బాతుల చెరువు వెత

హయత్‌నగర్: వానలు దంచి కొడుతున్నా హయత్‌నగర్‌లోని బాతుల చెరువులోకి మాత్రం నీరు రావడం లేదు. వరద కాలువలు కబ్జాలకు గురి కావడం, కాలువలపై నిర్మాణాలు వెలియడంతో వరుణుడు కరిణించినా చెరువులోకి చుక్క నీరు రావడం లేదు. గొలుసుకట్టు చెరువుల నిర్మాణంలో భాగంగా తుర్కయంజాల్ మాసబ్‌టాంక్ చెరువు అలుగు నీరు ఇంజాపూర్ జిలాన్‌ఖాన్ మీదుగా రాస కాలువ ద్వారా హయత్‌నగర్ చెరువులోకి రావాల్సి ఉంది. జిలాన్‌ఖాన్ చెరువు నుంచి బాతుల చెరువుకు వరద నీరు తెచ్చే రాసకాలువ అడుగడుగునా ఆక్రమణకు గురైంది. కాలువను పూడ్చి వేయడంతో బాతుల చెరువులోకి రావాల్సిన నీరు బంజారా కాలనీ మీదుగా నేరుగా పెద్ద అంబర్‌పేట్ ఈదుల చెరువులోకి చేరుతోంది. మాసబ్ టాంక్ చెరువు దిగువన ఉన్న ఈదుల చెరువు నీటితో పొంగి పొర్లుతున్నా బాతుల చెరువు మాత్రం నీరు లేక వెలవెలబోతోంది.

కాశన్నకుంట.. వెంచర్లే వెంట



చెరువులోకి నీరు చేరడంతో పైకి కనిపిస్తున్న వెంచర్ స్తంభాలు

కొత్తూరు: రియల్‌భూమ్ జోరుగా సాగిన సమయంలో మండలంలోని పలు చెరువులు, శిఖం భూముల్లో సైతం వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయించారు. నిబంధనలు పాటించకుండా ఎఫ్‌టీఎల్ లెవల్‌లో రోడ్లు, స్తంభాలు పాతి మరీ వ్యాపారులు బహిరంగంగా అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. కొత్తూరు మండలకేంద్రం ఎస్సీ కాలనీ సమీపంలో సుమారు 32 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాశన్నకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో రియల్‌వెంచర్ ఏర్పాటు చేశారు. దీంతో చెరువు నీటి నిల్వ సామర్థ్యం చాలా వరకు తగ్గింది. వర్షాకాలంలో చెరువులో నీరు పూర్తి స్థాయిలో నిండినప్పుడు వెంచర్ రోడ్లు, రాళ్లు కనిపించవు. స్తంభాలు మాత్రం పైకి కనిపిస్తున్నాయి.

తాళ్లపల్లి.. తెల్లబోయి

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లిలో లింగారెడ్డిగూడ చెరువు, నాగుల చెరువు ఉన్నాయి. గతంలో వర్షాలు కురిస్తే ముందుగా లింగారెడ్డి చెరువు నిండి నాగుల చెరువులోకి నీరు వచ్చేది. ఐదేళ్లుగా అక్రమార్కులు ఈ చెరువులోకి నీరు వచ్చే వరద కాలువలను ఆక్రమించారు. దీంతో నీరు లేక రెండు చెరువులు వెలవెలబోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన వరద కాలువలను విడిపించి మరమ్మతులు చేస్తే చెరువులోకి నీరు వస్తుందని రైతులు అంటున్నారు.



నాగుల చెరువు పరిస్థితి

న్యూస్‌రీల్

జిల్లా ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఎన్నిక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలిగా దళపతిరాజు సబితా రాజు ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణ గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఫార్మసిస్టుల సంక్షేమం, ఉద్యోగ ఫార్మసీ చట్టాల అమలు, రిజిస్టర్ ఫార్మసిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో ఫార్మసిస్ట్ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేసే క్రమంలో మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమితులైన సబితా రాజును సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్మా శంకర్, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ మెరుగు రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు ఫసియుద్దీన్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు తన్నీరు వేణు, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, అల్లూరి క్షత్రియ సంఘం అధ్యక్షుడు కేవీఆర్ ఆర్ వర్మ తదితరులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



మొక్కలు నాటిన విద్యార్థులు, అధికారులు

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని జిల్లా యువజన విభాగం అధికారి టి. ఐజయ్య అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మేరాభారత్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ‘ఏక్ పేడ్ మాకే నామ్’ కార్యక్రమంపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో రోజురోజుకూ అటవీ విస్తీర్ణం తగ్గిపోవడంతో పర్యావరణ అసమతుల్యత ఏర్పడి వర్షాలు సరైన సమయంలో కురవడం లేదని అన్నారు. ఫలితంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ప్రతి విద్యార్థి తన తల్లి పేరు మీద మొక్కను నాటి, దానిని తల్లిలాగే కాపాడుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని డీలర్లపై కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

మొయినాబాద్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ఫర్టిలైజర్ షాపులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి ఉష డీలర్లను హెచ్చరించారు. మున్సిపల్ కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లు, రికార్డులు, గోదాములు, లైసెన్స్ చెల్లుబాటు, యూరియా, ఇతర ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంఆర్‌పీ ధరలకు ఎరువులను విక్రయించాలని అన్నారు. అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యూరియాను కేవలం వ్యవసాయ అవసరాలకు విక్రయించాలని.. ఇతర వాణిజ్య అవసరాలకు ఇవ్వొద్దని సూచించారు. యూరియా నిల్వల గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అవసరమైన సమయానికి సరిపడా సరఫరా చేస్తామని చెప్పారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి అనురాధ ఉన్నారు.

పాఠశాలలను సందర్శించిన రాష్ట్ర బృందం



ఇన్ముల్‌నర్వ పాఠశాలలో బృందం సభ్యులు

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ, పెంజర్ల గ్రామాల్లోని ఎంఎంపీఎస్, జెడ్పీ ఉన్నత పాఠశాలలను ప్రణాళికా సమన్వయకర్తల రాష్ట్ర బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఆన్‌లైన్‌లో విద్యార్థుల నమోదు వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు బోధన, బోధనేతర అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర బృందం సభ్యుల వెంట మండల విద్యాధికారి అంగూర్ నాయక్ ఉన్నారు.



మాట్లాడుతున్న మత్స్యశాఖ జిల్లా అధికారిణి పూర్ణిమ

గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని మత్స్యశాఖ జిల్లా అధికారిణి పూర్ణిమ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, స్వయం ఉపాధిని పెంపొందించేందుకు దర్తీ ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజేజీయూఏ) పథకాన్ని అమలు చేయడం జరుగుతోందని తెలిపారు. ఈ పథకాన్ని పీఎంఎంఎస్‌వై పథకానికి అనుసంధానం చేయడం జరిగిందన్నారు. ఈ పథకంలో వ్యక్తిగతమైన, కమ్యూనిటీ పరమైన యూనిట్లు ఉన్నాయన్నారు. ప్రతి యూనిట్‌ను 10శాతం లబ్ధిదారుడి వాటా, 90శాతం సబ్సిడీ ద్వారా అమలు చేయడం జరుగుతుందన్నారు. చేపలు పట్టడం, అమ్మడం, రవాణా చేయడం, పెంపకంవంటి అంశాలపై అనుభవం కలిగి స్వయం ఉపాధిని పొందుతున్న గిరిజనులకు ఈ పథకం వర్తిస్తుందని వివరించారు. ఈ సమావేశంలో మత్స్యశాఖ అధికారులు ఏసుదాసు, అంబేద్కర్, యాదగిరి, గిరిజన నేతలు శ్రీనునాయక్, రూప్లానాయక్, శ్రీనునాయక్, శ్రీను, చందునాయక్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పనితీరు భేష్



భవిత సెంటర్‌ను సందర్శించిన బృందం సభ్యులు

రాష్ట్ర విద్యాశాఖ బృందం కితాబు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, పనితీరు బాగుందని రాష్ట్ర విద్యాశాఖ బృందం కితాబిచ్చింది. రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్‌లో భాగంగా బుధవారం రాష్ట్ర విద్యాశాఖ బృందం సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కుంటబడి), ఎంఆర్సీలోని భవిత సెంటర్, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు, డీఐఎస్ఈ నమోదు, మధ్యాహ్నభోజన పథకం, పాఠశాలల వివరాల నమోదు, పాఠ్య ప్రణాళికలు, భవిత్ సెంటర్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ నరేందర్, రాష్ట్ర కోఆర్డినేటర్ ఆజాద్, ప్లానింగ్ కోఆర్డినేటర్ శశిధర్‌రెడ్డి, ఎంఈఓ మనోహర్, ప్రధానోపాధ్యాయులు భాగ్యమ్మ, పద్మనళిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

మహేశ్వరం: గ్రామీణ ప్రాంత పేదలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యమని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని ఘట్టుపల్లిలో గ్రామానికి చెందిన ఎలక్ట్రికల్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కోరుపోలు అనంతరెడ్డి సొంత స్థలం, సొంత నిధులతో నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త భవనంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు చేసి రోగులకు నిత్యం వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆస్పత్రి ఏర్పాటుకు సొంత స్థలం ఇచ్చి, భవనం నిర్మాణం చేపట్టిన దాత అనంతరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, కోరుపోలు ప్రభాకర్‌రెడ్డి, కోరుపోలు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోరుపోలు రాకేష్‌రెడ్డి, వైద్యులు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మైసిగండిలో బోనాల ఊరేగింపు

ఘనంగా మైసమ్మ తల్లి బోనాలు



బోనంతో యువతి

కడ్తాల్ మండలం మైసిగండిలో బుధవారం మైసమ్మ తల్లి బోనాలు వైభవంగా నిర్వహించారు. కుండలను పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా బ్యాండు మేళాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. యువకుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సీఐ గంగాధర్, ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

\- కడ్తాల్

డ్రగ్స్ నిరోధానికి కృషి చేద్దాం

అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేద్దామని అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం మిషన్ పరివర్తన సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మత్తు పదార్థాలను పూర్తి స్థాయిలో నివారించేందుకు పని చేద్దామన్నారు. డ్రగ్స్ వాడకంతో కలిగే దుష్పరిణామాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని.. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తానని.. డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తానని ప్రతిజ్ఞ చేయించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

పహాడీషరీఫ్: వర్షాల సందర్భంగా మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువు, బుర్హాన్‌ఖాన్ చెరువులను బుధవారం ఆయన కమిషనర్ వెంకట్రామ్‌తో కలిసి పరిశీలించారు. పెద్ద చెరువు పూర్తి స్థాయిలో నిండి పారుతున్న అలుగును పరిశీలించారు. మిగులు నీరు పి–7 కార్గో రోడ్డులో పారుతూ వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా చూశారు. చెరువుకు ఎక్కడి నుంచి నీరు వస్తోంది.. మరిన్ని వర్షాలు కురిస్తే కట్ట సామర్థం ఏమిటి తదితర విషయాలపై నీటి పారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌ను అడిగి తెలుసుకున్నారు. మిగులు నీరు రోడ్డుపైకి రాకుండా అడ్డుగోడ కట్టే విషయమై అధ్యయనం చేయాలని సూచించారు. తర్వాత జల్‌పల్లి కమాన్ రోడ్డులో నీట మునుగుతున్న రెండు కల్వర్ట్‌లను పరిశీలించారు. కల్వర్ట్‌ల ఎత్తు పెంచేందుకు అంచనాలు రూపొందించాలన్నారు. అనంతరం ఉస్మాన్‌నగర్‌లోని బుర్హాన్‌ఖాన్ చెరువును పరిశీలించి ముంపు ఇళ్లలో ఎవరైనా ఉంటే, ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ ఇష్రత్ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.



జల్‌పల్లి చెరువును పరిశీలిస్తున్న శ్రీనివాస్

నిధుల స్వాహాపై విచారణ

• ఐకేపీ సిబ్బందితో డీఆర్‌డీఏ డీపీఎం సమావేశం
• చౌదర్‌పల్లి సీసీ, వీబీకే పాత్రలపై వివరాల సేకరణ
• రెండోరోజు కొనసాగిన మహిళల ఆందోళన



యాచారం ఎస్‌బీఐలో డ్వాక్రా సంఘాల మహిళల ఆందోళన

యాచారం: చౌదర్‌పల్లి గ్రామ స్వయం సహాయక సంఘాల్లో నిధుల స్వాహాపై బుధవారం అధికారులు విచారణ మొదలుపెట్టారు. గ్రామంలోని 30కి పైగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు అందాల్సిన దాదాపు రూ.2 కోట్లకు పైగా నిధులను ఫోర్జరీ సంతకాలు, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి స్వాహా చేసిన విషయం వెలుగులోకి రావడంతో రెండోరోజు కూడా గ్రామ మహిళలు ఆందోళన కొనసాగించారు. అప్పటి బ్యాంకు మేనేజర్ ఝాన్సీ రాణిని పిలిచి వీబీకేతో కలిపి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

కుమ్మక్కై నిధుల స్వాహా!

ఏదైనా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలంటే ఐకేపీ అధికారుల నుంచి మైక్రో క్రెడిట్ ప్లాన్ (ఎంసీపీ) రికార్డులు అందిన తర్వాతే మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ యాచారం ఎస్‌బీఐలో మాత్రం వీబీకే వరలక్ష్మి, అప్పటి మేనేజర్ కుమ్మక్కై, ఎంసీపీ లేకుండానే నకిలీ డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాల రికార్డులు సృష్టించి నిధుల స్వాహాకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. అధికారుల ఫిర్యాదుల ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

అధికారుల విచారణ

చౌదర్‌పల్లిలోని స్వయం సహాయక సంఘాల్లో జరిగిన అక్రమాలను ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. డీఆర్‌డీఓ శ్రీలత ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) లీలా కుమారి బుధవారం యాచారంలోని ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ ఏపీఎం రవీందర్, చౌదర్‌పల్లి సీసీ జంగయ్య, ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. అక్రమాలు జరుగుతుంటే ఏం పర్యవేక్షణ చేస్తున్నావని సీసీ జంగయ్యపై మండిపడ్డారు. ఎంసీపీలు పంపకుండానే వీబీకే, అప్పటి బ్యాంకు మేనేజర్ కలిసి నిధుల స్వాహాకు పాల్పడినట్లు ఆయన సమాధానమిచ్చారు. రికార్డులను పరిశీలించి ప్రతి స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై విచారణ చేపడతామని ఆమె తెలిపారు. అప్పటి బ్యాంకు మేనేజర్ ఝాన్సీరాణి పాత్రపై ఎస్‌బీఐ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్‌బీఐ ఏజీఎం రామకృష్ణయ్య యాచారం ఎస్‌బీఐలో విచారణ చేపట్టారు. 2022 నుంచి చౌదర్‌పల్లిలోని స్వయం సహాయక సంఘాలకు ఎన్ని రుణాలిచ్చారు, ఫోర్జరీ సంతకాలతో కూడిన నకిలీ డాక్యుమెంట్లను తనిఖీలు చేశారు. అవసరమైతే ఝాన్సీరాణిని పిలిచి విచారణ చేపడతామని తెలిపారు.

మైసిగండిలో ఎమ్మెల్యే పూజలు


మైసమ్మ తల్లి సన్నిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ తల్లి ఆలయాన్ని బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దర్శించుకున్నారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ట్రస్టీ శిరోలీ, తహసీల్దార్ జ్యోతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్ , తులసీరాం, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్‌కు క్యాష్ రివార్డు


కానిస్టేబుల్ రాజశేఖర్‌కు రివార్డు అందజేస్తున్న సీఐ, ఎస్‌ఐలు

కడ్తాల్: కేసు ఛేదనలో వృత్తి నైపుణ్యం కనబరిచిన కానిస్టేబుల్ రాజశేఖర్ బుధవారం క్యాష్ రివార్డు అందుకున్నారు. వివరాలు.. నాగర్ కర్నూల్ జిల్లా కోడేరుకు చెందిన కొమ్మురి శివకృష్ణ హైదరాబాద్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కోడేరులో తన చెల్లెలు స్వప్న పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని సమాచారం అందడంతో ఈ నెల 8న తెల్లవారు జామున ఆయన తన బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. కడ్తాల్ మండల కేంద్రం సమీపానికి చేరుకోగానే, గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో భాగంగా కానిస్టేబుల్ రాజశేఖర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, సీసీ టీవీ ఫుటేజీ సహకారంతో 24 గంటల వ్యవధిలోనే ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించారు. ఈ మేరకు ఆయనకు ఠాణాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ గంగాధర్, ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్‌లు, కానిస్టేబుల్ రాజశేఖర్‌కు ప్రోత్సాహకంగా రూ.5 వేలు క్యాష్ రివార్డు అందజేసి అభినందించారు.

సీపీఎస్ రద్దు చేయకపోతే ఆందోళన


సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న సంఘం నాయకులు

చేవెళ్ల: సీపీఎస్ విధానం రద్దు చేయకపోతే సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 10వేల మందితో మహాధర్నా నిర్వహించేందుకు సిద్ధమైనట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల చేవెళ్ల, మల్కాపూర్, గుండాల, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో బుధవారం సంఘం మండల అధ్యక్షుడు దయానందం, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, గౌరవ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పురందాస్, ఉపాధ్యాయులు హోహర్ ఉన్నీసా, దయానందం, రాజశేఖర్, బలరాం, రవీదర్‌రెడ్డి, వెంకటయ్య, కరుణాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

వ్యక్తి దుర్మరణం

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం చిన్న చెరువు కట్టపై బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. స్థానిక చిన్న చెరువు కట్ట వద్ద సర్దార్ పాపన్న విగ్రహం సమీపంలో తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు.

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై జింక..

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని రాష్ట్ర జంతువు జింక మృత్యువాత పడింది. వివరాలు.. గునుగల్ అటవీ ప్రాంతం నుంచి ఓ జింక బుధవారం మధ్యాహ్నం క్రీడా క్షేత్రంలోకి వెళ్లడానికి సాగర్‌రోడ్డు దాటుతోంది. ఈ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం గునుగల్ అటవీ ప్రాంతంలో ఖననం చేసినట్లు గునుగల్ అటవీ శాఖ అధికారి నర్సింహ తెలిపారు. జింకను ఢీకొట్టిన వాహనాన్ని గుర్తించేందుకు యాచారం పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలిస్తున్నారు.

ఏజీ బీఎస్సీ విద్యార్థి ఆత్మహత్య

రాజేంద్రనగర్: బ్యాక్‌లాగ్ ఉన్నాయని మనస్థాపానికి గురైన అగ్రికల్చర్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన ప్రకారం.. నాగోల్‌కు చెందిన రిత్విక్ రాజ్ (21) ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చరల్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. 2021 బ్యాచ్‌కు చెందిన రిత్విక్ రాజ్ వర్సిటీ హాస్టల్‌లో ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి 9 గంటలకు భోజనానికి వెళ్లారు. 10గంటల సమయంలో వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తోటి విద్యార్థులు అత్తాపూర్ సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది.

'లింక్ కల'వదే!


బురదమయంగా చల్లంపల్లి రేకులకుంటతండా రోడ్డు


వాస్‌దేవ్‌పూర్–బాలాజీనగర్ తండా రోడ్డు దుస్థితి

అధ్వానంగా అనుసంధాన రహదారులు

- బస్సు సౌకర్యానికి సైతం నోచుకోని పలు తండాలు, గ్రామాలు
- దశాబ్దాలుగా అవస్థలు పడుతున్న ప్రయాణికులు, ప్రజలు
- ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు

కడ్తాల్: పల్లెలు ప్రగతి పథంలో నడవాలంటే రహదారులు ప్రధానం. కానీ పలు గ్రామాలను కలిపే లింక్ రోడ్లు ఏళ్ల తరబడి అనుసంధానానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు, ప్రయాణికుల కల దశాబ్దాలుగా నెరవేరడం లేదు. వీటిని బాగు చేయాలని కోరుతూ ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా ఫలితం లేకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్వాయిపల్లి నుంచి గోవిందాయిపల్లి, గోవిందాయిపల్లి నుంచి గోవిందాయిపల్లితండా, చల్లంపల్లి– మక్తమాధారం, వంపుగూడ –టాక్‌రాజ్ గూడ, మక్తమాధారం– పెద్దారెడ్డి చెరువుతండా, కర్కల్‌పహాడ్– వంకరాయితండా, సాలార్‌పూర్– రేకులకుంటతండా, చల్లంపల్లి– రేకులకుంటతండా, చల్లంపల్లి– పీపీబాయితండా, వంపుగూడ– పీపీ బాయితండా, ముద్వీన్– కొనాపూర్ రోడ్డు, వాసుదేవ్‌పూర్ నుంచి బాలాజీనగర్‌తండా, మైసిగండి– గానుగుమార్లతండాకు చెందిన అనుసంధాన రహదారులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మట్టి రోడ్లు బురదమయం అవుతున్నాయని పేర్కొంటున్నారు. పలు గ్రామాలకు ద్విచక్రవాహనాలు, ఆటోలు కూడా వెళ్ల లేని పరిస్థితులు నెలకొన్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలుగా గడిచినా లింక్ రోడ్ల అభివృద్ధికి అడుగులు పడటం లేదని మండల ప్రజలు, తండాల గిరిజనులు అసహనం వ్యక్తంచేస్తున్నారు.

బీటీ రోడ్లుగా అభివృద్ధి చేస్తే..

▲ గోవిందాయిపల్లి మీదుగా ఎక్వాయిపల్లి, మైసిగండి వరకు బీటీ రోడ్డు నిర్మించి, ఆర్టీసీ బస్సులు నడిపిస్తే గోవిందాయిల్లి ప్రజలు, విద్యార్థులు, రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

▲ చల్లంపల్లి నుంచి మక్తమాధారం వరకు బీటీ నిర్మిస్తే రావిచేడ్, మక్తమాధారం, షాద్‌నగర్ తదితర గ్రామాల మధ్య దూరభారం తగ్గడంతో పాటు రవాణా సదుపాయం మెరుగుపడుతుంది.

▲ ముద్వీన్– కొనాపూర్ రహదారిని బీటీగా అభివృద్ధి చేస్తే ఆకుతోటపల్లి, ఆమనగల్లు తదితర గ్రామాలకు వెళ్లేందుకు దూరం తగ్గడంతో పాటు ఆయా గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

▲ వాస్‌దేవ్‌పూర్ నుంచి బాలాజీనగర్‌తండా వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తే, చల్లంపల్లి, తలకొండపల్లి తదితర గ్రామాలకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వంలో నైనా ఆయా లింక్ రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి చేయాలి



గ్రామాలు, తండాలకు సంబంధించిన లింకు రోడ్లను అభివృద్ధి చేస్తే రవాణా సౌకర్యం మెరుగు పడుతుంది. ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతుంది. ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టిసారించాలి.

– సమన్‌నాయక్, వాస్‌దేవ్‌పూర్

బస్సు సౌకర్యం కల్పించాలి



గోవిందాయిపల్లి నుంచి మైసిగండి, ఎక్వాయిపల్లి గ్రామాలకు వెళ్లే రహదారి గుంతల మయంగా ఉంది. దీంతో బస్సు సౌకర్యానికి నోచుకోలేక పోతున్నాం. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ చూపాలి.

– శేఖర్‌గౌడ్, గోవిందాయిపల్లి

ప్రతిపాదనలు పంపాం



లింక్ రోడ్లను ఇప్పటికే పరిశీలించాం. వీటి అభివృద్ధి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– పరమేశ్, పీఆర్‌ఏఈ, కడ్తాల్

పెన్షన్ పెంచి ఇవ్వాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం పెన్షన్‌దారులకు పెన్షన్ పెంచి ఇచ్చి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాగల్ల ఉపేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ ఆధ్వర్యంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగల్ల ఉపేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు రూ.6వేలు, చేయూత పెన్షన్ రూ. 4వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని అన్నారు. అందాల పోటీలు, భూ స్వాములు, రైతు భరోసాకు, అభివృద్ధి పేరుతో, యాడ్‌ల పేరుతో రూ.వేల కోట్లు ఖర్చు పెడుతున్నప్పుడు దివ్యాంగులు, చేయూత పెన్షన్ దారులకు పెన్షన్ ఎందుకు పెంచడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వానికి పోరాటాల ద్వారానే గుణపాఠం చెబుదామని పిలుపునిచ్చారు. ఈ నెల 16న షాద్‌నగర్‌లో నిర్వహించనున్న పెన్షన్‌దారుల సభకు మందకృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వితంతువులు, నేత, గీత, బీడీ కార్మికులు, చేయూత పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బాలరాజు, సురేష్, అశోక్, పాండు, శ్రవణ్, ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం


కాలిపోయిన దుస్తులను చూపుతున్న బాధితురాలు

మహేశ్వరం: భారీ వర్షాల నేపథ్యంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని తుమ్మలూరులో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అక్కెర రమాదేవి ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా టీవీ, రిఫ్రిజిరేటర్, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు, దుస్తువులు కాలిపోయాయి. తమది నిరుపేద కుటుంబమని.. భర్త మరణించాడని ఇద్దరు కూతుర్లను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ జీవనం సాగిస్తున్నాని ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని కోరింది. విద్యుత్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు పత్రం సమర్పించారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్

ఇబ్రహీంపట్నం: దళితుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలం అయ్యారని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.సామేల్, కార్యదర్శి ప్రకాశ్‌కారత్ విమర్శించారు. సంఘం జిల్లాస్థాయి వర్క్‌షాపు బుధవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటికీ గ్రామాల్లో అంటరానితనం, కుల వివక్ష కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు 25 ఏళ్లుగా భర్తీకి నోచుకోవడం లేదన్నారు. ఉన్నత విద్యనభ్యసించినా ఉద్యోగాలు రాక కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌కు 13 ఏళ్లుగా నిధులు కేటాయించడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మనోహర్, వెంకటేశ్, ఆనంద్, వీరేష్, సత్తన్న, కుర్మయ్య, నర్సింహ, జంగయ్య, రాజు పాల్గొన్నారు.

కృత్రిమ ఇసుక తయారీ కేంద్రంపై దాడి

- ఫిల్టర్ ధ్వంసం
- లారీ, ట్రాక్టర్ సీజ్

కడ్తాల్: కృత్రిమ ఇసుక తయారు చేసినా, అనుమతులు లేకుండా ఇసుక తరలించినా చర్యలు తప్పవని సీఐ గంగాధర్ హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం రెవెన్యూ సిబ్బంది, పోలీసులు అధికారులు మండల పరిధిలోని ముద్వీన్‌లో కొనసాగుతున్న కృత్రిమ ఇసుక తయారీ కేంద్రంపై దాడి చేశారు. ఈ సందర్భంగా ఫిల్టర్‌ను ధ్వంసం చేశారు. ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, లారీని సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ బాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రాములు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

మాజీ నక్సలైట్‌నంటూ బెదిరిస్తున్నాడు

డీసీపీకి ఇండిపెండెంట్ ఫెలోషిప్ పాస్టర్ల ఫిర్యాదు

మహేశ్వరం: మాజీ నక్సలైట్‌నని చెబుతూ.. దళిత క్రైస్తవులు, చర్చి పాస్టర్లను వేధించడమే కాకుండా, చర్చి స్థలాల కబ్జాలకు పాల్పడుతున్న మందుముల సాయిలుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇండిపెండెంట్ ఫెలోషిప్ సంస్థ పాస్టర్లు బుధవారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డికి ఫిర్యాదు చేశారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఉన్న చర్చి పాస్టర్లు, క్రైస్తవులను బెదిరింపులకు గురిచేస్తూ చర్చి, సమాధుల స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకుడినంటూ గ్రామాలు, కాలనీల్లో కొంత మంది పేద పాస్టర్లతో ప్రభుత్వ స్థలాల్లో చర్చిలు పెట్టిస్తున్నట్లు తెలిపారు. అసైన్డ్, వివాదాస్పద భూముల్లో గుడిసెలు, రేకుల షెడ్లు వేయించి, కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. చర్చిల నిర్మాణం వంక చెబుతూ కానుకల పేరిట అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడన్నారు. పాస్టర్‌గా చెప్పుకొనే ఈయనకు చర్చిలు, క్రైస్తవ సంఘాల్లో ఎలాంటి సభ్యత్వం లేదని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో రాబిన్ జాయ్, శ్యామ్ సుందర్‌రెడ్డి, జోనా తదితరులు ఉన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు నేటితో గడువు పూర్తి

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ, పీజీ కళాశాలలో మిగిలి ఉన్న ఎస్టీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లకు గురువారంతో గడువు పూర్తవుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న గిరిజన విద్యార్థినులు స్పాట్ అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. కళాశాలలో అడ్మిషన్లు తీసుకునే విద్యార్థినులకు బీకాం (కంప్యూటర్ సైన్స్), ఎంపీసీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ, ఎంపీసీ, ఐఎంఎస్సీ (ఇంటిగ్రేటెడ్ పీజీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. స్పాట్ అడ్మిషన్ తీసుకోవాలనుకునే విద్యార్థినులు నేరుగా కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు 97034 41345 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చింతపట్లలో మేకల చోరీ

యాచారం: కొట్టంలో కట్టేసిన మేకలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని చింతపట్లకు చెందిన ఎండీ బషీర్ మంగళవారం సాయంత్రం తన పొలం వద్ద ఉన్న కొట్టంలో 11 మేకలను కట్టేసి ఇంటికొచ్చాడు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం 5 గంటలకు కొట్టం వద్దకు వెళ్లగా మేకలు కనిపించలేదు. సమీప పొలాల్లో వెతికినా కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించి సుమారు రూ.2లక్షల విలువైన మేకలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

వాటర్ ఫాల్స్ కనువిందు

విస్తారంగా కురుస్తున్న వర్షాలతో బోడకొండ గుట్టల్లో పారుతున్న వరద వాటర్ ఫాల్స్‌లా కనువిందు చేస్తోంది. ఈ ప్రదేశం ప్రమాదకరంగా ఉండటంతో పర్యాటకులు, యువత ఇక్కడికి రాకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాలకే ప్రమాదమంటూ హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. – మంచాల


పోలీసులు ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డు


బోడకొండ గుట్టల్లో జల సవ్వడి

పోల్కంపల్లిలో గేదెల అపహరణ

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని దుండగులు రెండు గేదెలను అపహరించుకొని వెళ్లిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని పోల్కంపల్లి అనుబంధ గ్రామమైన జాజోనిబావి గ్రామానికి చెందిన కసరమోని ఐలయ్య మంగళవారం రాత్రి తన డెయిరీ ఫాం వద్ద ఉన్న గదిలో నిద్రిస్తున్నాడు. గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి ఐలయ్య నిద్రిస్తున్న గదికి బయటి నుంచి తాళం వేసి రెండు గేదెలను తీసుకుని పరారయ్యారు. బుధవారం తెల్లవారుజామున ఐలయ్య మెల్కొని డోర్ తీసే ప్రయత్నం చేయగా తెరుచుకోలేదు. దీంతో కుటుంబసభ్యులకు ఫోన్ చేయగా వారు అక్కడికి చేరుకొని తాళం పగులగొట్టారు. సుమారు రూ.3లక్షల విలువ చేసే గేదెలను అపహరించుకొని వెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.